## 13

# దేవుని సత్యము మరియు మానవ తప్పిదములు

## (2 థెస్సలొనీకయులకు 2:1-12)

చాలామంది ప్రజలకు, పెద్దవారగుటయంటే బలమును మరియు సామర్థ్యములను, బంధువులను మరియు సహోదరులను కోల్పోవుట అని అర్థం. ఈ సమయములో, నిత్యము నిలిచియుండుట, మరియు నిత్యత్వపు ఆశీర్వాదముల మరి స్పష్టముగాను, మరియు ఆనందింపతగినవిగాను ఉండును. క్రైస్తవునికి, జీవితము యొక్క ముగింపు అనగా ఘనత మరియు మహిమల శిఖరం. మనము మరణించుటకు ముందుగానే క్రీస్తు వచ్చినను కూడ, మనము ఆయనతో కలుపబడే ఒక మహిమకరమైన ఐక్యత కొరకు ఎదురుచూడవచ్చు.

థెస్సలొనీకయా పట్టణములో కొందరు, అప్పటికే చనిపోయినవారు యేసుతో కలుపబడే ఈ గొప్ప మహిమాయుక్తమైన ఐక్యతను కోల్పోయి ఉన్నారని బాధపడుచుండిరి. మరణమనేది యేసుతో తిరిగి ఐక్యము చేయబడుటనే ఆ పరవశమైన భావప్రాప్తినుండి విశ్వాసియైన ఏ క్రైస్తవుని నిరోధించలేదని 1 థెస్సలొనీకయుల పత్రికలో వారికి హామీ యివ్వబడింది.

యేసు యింతకు ముందే వచ్చాడు అనే వార్తను బట్టి, 2 థెస్సలొనీకయులకు వ్రాసిన పత్రికను వ్రాసే సమయానికి, క్రైస్తవులు కలవరములో ఉన్నారు. అలాగైనట్టయితే, వారు క్రీస్తుతోను మరియు అంతకు ముందే చనిపోయినవారి సహోదరులతోను ఏకం చేయబడే ఐక్యతను కోల్పోయియుందురు. మొదటి పత్రికవలే, రెండవ పత్రిక కూడ క్రీస్తు రాకడను గూర్చిన సత్యముతో వారిని ఓదార్చుటకు వ్రాయబడినది. ఈ సత్యము, అసత్యాలకు విరుద్ధముగా క్రైస్తవుల యొక్క భవిష్యత్ నిశ్చయమైయున్నదని చూపుచున్నది.

అబద్ధ బోధలు ఎల్లప్పుడు నష్టపరుచునవి. ఇది జీవన మార్గమునుండి క్రైస్తవులను తప్పించగలదు. ఇది విలువైన దానినుండి వారి యొక్క మనస్సును చెదరగొట్టును. ఇది దేవునిని అనుసరించుటవైపుకు మళ్ళించవలసిన వనరులను వృథా చేయును. అబద్ధ బోధలు నష్టపరచకుండునట్లు మనమెట్లు వాటిని నిరోధించగలము? వారివలననైన భయమును మనమెట్లు ఎదుర్కోగలము?

### అబద్ధ బోధలను కనిపెట్టండి (2:1-5)

సంఘ చరిత్రలో తరచూ, ఒక్కొక్కరు ఒక క్రొత్త బోధతోను, మరికొన్నిసార్లు, ఉల్లిక్కిపడునట్లుగా విభిన్న బోధలతో వచ్చేవారు. తరుచుగా ఈ బోధలన్నియు కూడ ప్రవచనాల నెరవేర్పును గూర్చినవి. పాత నిబంధనా ప్రవచనాలైన ప్రభువు రాకడను గూర్చి, ప్రభువు వచ్చి రాజ్యమును స్థాపించుటను గూర్చి, లేదా క్రొత్త నిబంధనా ప్రవచనాలైన ప్రభువు యొక్క తీర్పు మొదలగునట్టివాటిపై చాలామంది దృష్టిని సారించారు.

చాలా సందర్భాలలో ప్రజలు యేసు త్వరలో రాబోవుచున్నాడని, లేదా అప్పటికే రహస్యముగా వచ్చియున్నాడని జోతిష్యము చెప్పిరి. స్పష్టముగానున్న ఈ బయలుపాటును బట్టి ప్రజలు ఆశ్చర్యపడుదురు మరియు వారి జీవితములు మరియు నమ్మకములను మార్చుకొనే

విధముగా భయపడిరి. మనమే విధముగా ఈ విధమైన తప్పుడు బోధలను కనిపెట్టగలము మరియు వాటినుండి రక్షించుకొనగలము?

మొదటిగా, మనము ఈ తప్పుడు బోధకుల మూలాలను గుర్తించవలెను. ఎవరును కనుగొనని ఒక బోధను పరిచయం చేసినప్పుడు, ఒక వ్యక్తి తనకు ప్రత్యేకముగా బయలుపరచబడినదని లేదా దర్శనము కలిగినదని ప్రకటించుకొనినప్పుడు మనము తప్పక జాగ్రత వహించవలెను. తన వద్దనున్న సమాచారము సమస్త జ్ఞానమును వెలికి తీయుటకు మూలమని లేక సమస్త బయలుపాటుకు మూలమని లేక యితరులు చెప్పిదంతా తప్పు అని ఒక వ్యక్తి ప్రకటించుకొనినప్పుడు తప్పక జాగ్రత వహించవలెను. తరచూ ఈ తప్పుడు బోధలనేవి, నూతన నిబంధన అపొస్తలులు మరియు ప్రవక్తలద్వారా చివరిగా మరియు సంపూర్తిగా ఇవ్వబడిన బయలుపాటుకు బదులు గూఢముగా మాట్లాడిన వాటిపై లేదా బైబిల్ యొక్క అలంకార రూపములో ఉన్న వాక్యభాగములనుండి కనుగొనబడినవి.

నూతన బయలుపాటు సందేశము బహుశ అపొస్తలుల అధికారమును బట్టి ప్రకటిస్తున్నామని చెప్పుకొంటూ ఈ నూతన క్రైస్తవులకు (2:1, 2) అందించబడింది. కాబట్టియే వారు “చంచలమనస్కులు కాకుండవలెననియు, వెదకకుండవలెననియు హెచ్చరించబడ్డారు.” ఎందుకనగా అది వంచనతో కూడినది. వారు జాగ్రతగా యుండవలసినవారైయున్నారు. అదేవిధముగా మనము కూడ నూతన బోధల విషయములో జాగ్రత్తగా యుండవలెను, బోధయెంత ఆసక్తికరమైనదైనప్పటికి మనము దానికి ఆకర్షితులమవ్వకూడదు. ఎందుకనగా అది దేవుని బయలుపాటుకాక మానవ మనస్సునుండి వచ్చినదైయుండవచ్చు.

రెండవదిగా, మనము తప్పక బోధను కూడ పరిశీలంచాలి. మనమెరిగిన ప్రభువు వద్దనుండి మరియు ఆయనచే ప్రేరేపించబడిన బోధకులనుండి వచ్చిన దానితో అవి ఏకీభవించుచున్నాయా? ఒక వేళ అది నూతన నిబంధన బోధించినదానితో ఏకీభవించకుండినట్టయితే, అప్పుడది వాస్తవము కాదని మనము తెలుసుకొవచ్చును. అబద్ధ బోధను అర్థము చేసుకొనుట ఇబ్బందిగా ఉండవచ్చు, కానీ మనము సత్యమును ఎరిగియున్నట్టయితే మరియు నూతన బోధ దానితో విరుద్ధముగా ఉన్నట్టయితే, అది తప్పక తప్పుడు బోధయే.

ఇది మన సొంత తల్లిదండ్రులను ఎరుగుటవంటిది. ఒకవేళ యితరులు తాము మీ తల్లిదండ్రులమని చెప్పుకొని వచ్చినట్టయితే, వారు ఎవరో, వారెందుకు ఆ విధముగా ప్రకటించుకొన్నారో మీకు తెలియకపోవచ్చు, కానీ వారి యొక్క ప్రకటన సత్యమైనది కాదని మీరు తెలుసుకొనవచ్చును. వారు మీ తల్లిదండ్రులు కారు. అదేవిధముగా, సత్యమును ఎరిగియుండుట అసత్యమును బేరీజు వేయుచూ, దానిని గుర్తించుటకు సహకరించును మరియు దానికి ప్రతిగా మిమ్మును రక్షించుకొందురు.

థెస్సలొనీకయులు చింతకలిగినవారుగా మరియు కలవరము చెందిన వారుగానున్నారు. కానీ వారు అప్పటికే యేసు క్రీస్తు రాకడను గూర్చిన సత్యముచే జ్ఞాపకము చేయబడినారు (2 థెస్సలొనీకయులకు 2:5). వారు అప్పటకే సత్యమును స్వీకరించారు అని ఎరిగియున్నట్ట యితే, వారు నూతన తప్పులను కనుగొనగలరు. ఎప్పుడు ఖచ్చితముగా ఈ తప్పుడు బోధ తలెత్తెనని లేదా ఎవరు దానిని ప్రోత్సహించిరని వారికి తెలియదు; కానీ అది అసత్యమైనదని మరియు దానిని బోధించువాడు దేవునికి వ్యతిరేకియని ఎరుగుదురు.

ఎవరైతే దేవుని సత్యమును వ్యతిరేకించెదరో వారు దేవునిని వ్యతిరేకించుదురు. వారు

వారి మతములో వారికివారే అధికారము కలుగజేసుకొని దేవుని ప్రజల మనస్సులలో దేవునికి బదులు వేరొకరిని పెట్టుటకు ప్రయత్నించుదురు. వారు దేవుని వ్యతిరేకులుగా గుర్తించబడవలసిన అవసరమున్నది, కానీ దేవుని ప్రజలు సత్యమును ఎరిగినప్పుడు మాత్రమే ఇది సాధ్యము.

సత్యమును ధ్యానించుము! సత్యమును నేర్చుకొనుము! సత్యములో నిలువుము! ఇదియే అసత్యమును ఎదురించుటకైన మేలైన మార్గము! అజ్ఞానము, బైబిలును నిర్లక్ష్యము చేయుట, మరియు దేవుని వాక్యమును నిర్లక్ష్యము చేయుట మొదలుగునవి అబద్ధబోధల ప్రవేశమునకు మార్గములు. సత్యమును తెలుసుకొనుము. కేవలము సత్యము మాత్రమే మనలను స్వతంత్రులుగా చేయును (యోహాను 8:32). ఇదియే తప్పుడు బోధలను కనుగొనగల విధానము.

## సత్యబోధను పునరుద్ఘాటించుము (2:6-9)

సత్యమనేది ఎల్లప్పుడు సత్యమే, కానీ అది మరచిపోగలిగినది, ప్రత్యేకముగా ఒత్తిడి సమయాలలో సత్యమును మరచిపోతాము. కష్ట సమయాలు వచ్చినప్పుడు సమాధానమును మరియు నమ్మికను కలిగియుండులాగున మన విశ్వాసానికి సంబంధించిన మూలపాఠములు తరచుగా జ్ఞాపకము చేయబడవలెను. మూల పాఠములను ప్రత్యేక పరచి నొక్కి చెప్పుటలో మనము విఫలమైనట్టయితే అప్పుడు మన విశ్వాసము యొక్క మూలపాఠాలు సురక్షితం కానివిగా ఉండును.

వ్యక్తిగత లేదా సమాజిక, బైబిల్ బోధకుడు సత్యమైనది మరలా మరలా చెప్పబడినదో లేదో దృఢపరచుకొనును. “అదే సంగతులు మీకు వ్రాయుట నాకు కష్టమైనది కాదు, మీకు అది క్షేమకరము” (ఫిలిప్పీయులకు 3:1బి). బోధించబడినది ప్రతిది కూడ మరలా పునః పరిశీలించవలసినదైయున్నది. ఒకవేళ మనము క్రొత్తగా బోధించుట మరియు భిన్నముగా బోధించుటయే మంచిగా బోధించుటయని అనుకొనినట్టయితే, మనము యేసు యొక్కయు మరియు ఆయన శిష్యుల యొక్కయు ప్రాథమిక పద్ధతియైన – ఆత్మల క్షేమముకొరకు మరలా మరలా చెప్పుటను కోల్పోతున్నాము.

థెస్సలొనీకయులకు వ్రాసిన లేఖలో, ఈ విధానము అనుసరించబడింది. డజనుకంటే ఎక్కువసార్లు పౌలు తాను యింతకు ముందు బోధించినవాటిని మరలా, మరలా సూచించాడు. ఈ సత్యము బాగుగా నేర్చుకొనులాగున మరియు వారి జీవితాలకు ప్రయోజనకరంగా ఉపయోగించుకొనులాగున మరలా మరలా చెప్పబడింది.

రాబోవుచున్న ఈ భ్రష్టత్వమును గూర్చి, అలాగే విశ్వాసమునుండి పడిపోవుటను గూర్చి థెస్సలొనీకయులు అప్పటికే హెచ్చరించబడిరి. ఎవరో ఒకరు దేవునినే సవాలు చేసెదరనే బయలుపాటును వారు అంతకు ముందే పొందియున్నారు. యేసు రాకడకు మునుపే యిటువంటిది జరుగునని కూడ వారు ఎరుగుదురు. యేసు రాకడ యింకను జరుగలేదు కాబట్టి యేసు యింతకు ముందే తిరిగి వచ్చాడన్న వార్తలు అసత్యములు. అటువంటి వార్తలచే కలవరపడుటకు వారెట్టి కారణమును కలిగియుండలేదు; కానీ దేవుని మనస్సునుండి బోధించబడిన సత్యములు వారికి తప్పక జ్ఞాపకము చేయుచుండవలెను.

## సత్య బోధను విశ్వసించుడి (2:10-12)

కొన్నిసార్లు ప్రజలు అబద్ధ బోధలను నమ్మినప్పుడు మనము ఆశ్చర్యపోతాము. సందేశము లేదా బోధ అబద్ధమైనది కాబట్టి ప్రజలు దానిని తిరస్కరిస్తారని మనమనుకుంటాము. కానీ తరచూ ప్రజలు సత్యమును తిరస్కరించి అసత్య బోధను అంగీకరించెదరు. వారు ఎలా ఈ విధముగా చేయగలరు?

ఈ వైఖరికి సమాధానమేమనగా, తప్పుడు బోధలు ఆకర్షణీయమైనవిగా ఉండును. వాటిలో ఒకటి గొప్పతనము లేదా ఉన్నతమైన జ్ఞానమును కలిగియున్నట్టుగా చూడబడును. రెండవది నూతన బోధను కనుగొనాలనే ఆశ. కొన్నిసార్లు అబద్ధ బోధలను అంగీకరించుట ఒక వ్యక్తిని ప్రఖ్యాతిగాంచినవానిగా చేయును. ఎందుకనగా అబద్ధ బోధ చాలా త్వరగా మరియు విస్తారముగా అంగీకరించబడియున్నది కాబట్టి. మనము తిరస్కరించబడుదుమేమో అనే భయమును కలిగియున్నాము కాబట్టి, సత్యమును అంగీకరించి దానిని చేర్చుకొని వారిచే తిరస్కరించబడుటకంటె వారితో సమ్మతించుటయనేది మనకు మరి సౌకర్యమైనదిగా ఉండును. కొన్నిసార్లు ప్రజలు తప్పుడు బోధలను అంగీకరిస్తారు ఎందుకనగా వారు వారి విశ్వాసము మరియు నమ్మకము యొక్క ఫలితములను చూచుటలో విఫలమగుదురు. ఏ విధముగా అబద్ధ బోధలు దేవుని వాక్యమునకు విరుద్ధముగానుంటాయో మరియు ఆత్మలను నష్టపరుస్తాయో చూచుటలో విఫలమగుదురు.

తప్పునకు వెనుక సత్యము పట్ల ప్రేమ లేకపోవుట ఉండును. అబద్ధ బోధను అంగీకరించినవారికి సత్య విషయమైన ప్రేమ ప్రాముఖ్యమైనది కాదు; వారు తప్పులను మరియు తప్పుడు బోధలను మరి ఆకర్షణీయమైనవిగా చూచెదరు. వారికి తప్పుడు బోధలవలనైన గొప్పతనము, ప్రఖ్యాతి, మరియు అంగీకారములు, సత్యముకంటే కూడ ప్రాముఖ్యమైనవి. సత్య విషయమైన ప్రేమ లేకపోవుటవలన కలుగు పరిణామం ఆత్మల నాశనం.

సత్యమును ప్రేమించనివారు అసత్యమైనదానిని సత్యముగా నమ్మునట్లు మోసపుచ్చబడుదురని థెస్సలొనీకయులు హెచ్చరించబడ్డారు (2:10-12). వారు దేవుని యొక్క సత్య వాక్యము రక్షణ శక్తిని కొల్పోవుదురు మరియు తప్పిపోయినవారుగా ఉందురు.

మన కొరకు ఇవ్వబడిన సందేశము చాలా స్పష్టముగానున్నది. మనము సత్యమును తిరస్కరించినట్టయితే, మనము రక్షణను తిరస్కరించుచున్నాము. ఏవిధముగానైతే దేవుడు, ఆయన వాక్యము కలిసియున్నాయో, అదేవిధముగా దేవుని సత్యము మరియు ఆయన రక్షణ ఒకదానికొకటి సన్నిహితముగానే ఉండును. "క్రీస్తు బోధయందు నిలిచియుండక దానిని విడిచి ముందుకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు, ఆ బోధయందు నిలిచి యుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించనివాడైయున్నాడు" (2 యోహాను 9). దేవుని సత్యమును తెలుసుకొనుట మరియు నమ్ముట అనే ఆశీర్వాదములను కూడబెట్టుము. దేవునితో సహవాసమును కలిగియుండుటకైన ఏకైక సాధనము ఇది ఒక్కటే.

## ముగింపు

అబద్ధ బోధయనేది సంఘమునకు మరియు ప్రతి ఒక్క క్రైస్తవుని విశ్వాసానికి మరియు శ్రేయస్సుకును ఒక తీవ్రమైన సవాలులాంటిది. తప్పుడు బోధలవలనైన ప్రమాధమును మనమందరము తప్పక జాగృతి కలిగి ఉండవలెను మరియు మన విశ్వాసమును ఎలాగు

కాపాడుకొనవలెనో ఎరిగియుండవలెను. ప్రతి క్రైస్తవుడు హెచ్చరికగాను, జాగ్రతగాను దేవుని దైవ ప్రేరేపిత వాక్యమునకు విరోధంగా ఉన్న ప్రతి ఉపదేశమును పరీక్షించవలెను. ప్రతి ఉపదేశకుడు జాగ్రతగాను, సంపూర్ణంగాను అట్టి ఉపదేశములను ఎరిగి ఉండవలెను. అందరికంటె మనము దేవుని ప్రేమించవలెను మరియు ఏ యితర ఉపదేశములకంటెను దేవుడు చెప్పువాటిని విలువగా ఎంచవలెను. యిట్టిది మనలను భ్రష్టులగకుండునట్లు కాపాడును మరియు యేసు క్రీస్తు ద్వారా దేవుడు బయలుపరచిన సత్యమందు మన విశ్వాసమును దృఢపరచును!

దేవుడు కోరుకొన్నవాటిని – మార్గదర్శకం, రక్షణ, నిత్యత్వం కొరకైన హామి – పొందునట్లుగా సత్యమును మరియు దాని శక్తిని గూర్చి క్రైస్తవులకు జ్ఞాపకం చేయాలి.